క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ దిగువగెరిగదొన గ్రామంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి గురువారం తెలిపారు. దిగువ గెరిగదొన, ఎగువ గెరిగదొన, మఠ్రిమాకులకండ్రిగ, సొడేపల్లె, ఆర్‌కేఎం పురం, మాంబేడు, కసవనూరు, ధర్మాచెరువు, టీకేఎంపురం పంచాయతీలోని టీకేఎంపురం, తిరుమలరాజపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

సుబ్రమణ్యం కుటుంబానికి పరామర్శ



సుబ్రమణ్యం మృతదేహానికి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

వెదురుకుప్పం: మండలంలోని నెమలగుంటపల్లెలో బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందిన గుండాలయ్య (సుబ్రమణ్యం) కుటుంబాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి పరామర్శించారు. విషయం తెలుసుకున్న కృపాలక్ష్మి గురువారం గ్రామంలో పర్యటించి సుబ్రమణ్యం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. తాము అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన గీత కుటుంబాన్ని పరామర్శించి గీత కుమార్తెను అక్కున చేర్చుకుని తామున్నామంటూ ధైర్యం చెప్పారు. ఆమె వెంట జెడ్పీటీసీ సుకుమార్, జేసీఎస్ కన్వీనర్ సుబ్రమణ్యం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రామయ్య, మాజీ మండల అధ్యక్షుడు పేట దనంజయరెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్యామల, గోవిందన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొజ్జారెడ్డి, వెంకటేష్, కార్యకర్తలు ఉన్నారు.

లత కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



లత మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంటకు చెందిన టీ.లత (45) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. ఇది తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, సర్పంచ్ దివ్య, మాజీ సర్పంచ్ మునికృష్ణ, పలువురు లత మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ఆమె ఎంతగానో కృషి చేశారని, ఆమె మృతి పార్టీకి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. లత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యం, గాంధీ తదితరులు ఉన్నారు.


ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. మండలంలోని ఆముదాల, రంగాపురం గ్రామంలో గురువారం డ్వాక్రా సంఘ సభ్యురాలతో కలసి ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన వారందరూ తప్పనిసరిగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు. మంచి నాయకత్వం కోసం ఓటు వేయడం ముఖ్యమన్నారు. సీసీ చిరంజీవి, సంఘమిత్ర మరగయ్య, డ్వాక్రా సంఘ సభ్యురాలు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కార్వేటినగరం: విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. స్థానిక శ్రీలక్ష్మీనరసింహ ఉన్నత పాఠశాలలో 12 వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కరస్పాండెంట్ ధనంజయరెడ్డి, డైరెక్టర్ దిలీప్‌కుమార్, వెంకటేష్, పురుషోత్తం, హెచ్‌ఎం మహేశ్వర్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- దొంగలంతా ఏకమై కూటమి కట్టారు
- ప్రజా కోర్టులో శిక్ష తప్పదు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్కే రోజా

జనమే మా బలం

జగనన్నకే మళ్లీ పట్టం



ఎన్నికల ప్రచారంలో మంత్రి రోజా



కల్లూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ''రాష్ట్రంలోని దొంగలందరూ ఏకమై కూటమి కట్టారు.. ప్రజా కోర్టులో ఈ దొంగలందరికీ తగిన శిక్ష పడక తప్పదు..జగనన్నకే మళ్లీ పట్టం కట్టడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారు'' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు. గురువారం సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని తొలిసారిగా వడమాలపేట మండలం కల్లూరులో కరపత్ర ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించారు. తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను అందించిన ముఖ్యమంత్రి దేశంలో మొత్తం మీద ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. తెలుగుదేశం నేత చంద్రబాబు కుటిల రాజకీయాలకు కాలం చెల్లిందని 2019 ఎన్నికల్లోనే రుజువైందన్నారు. టీడీపీ తీసుకొచ్చిన ఒక్క మంచి సంక్షేమ పథకాన్ని చెప్పగలరా? అంటూ ప్రశ్నించారు. బాబు ఎన్నికల హామీలను ఓటు హక్కు లేని వారు కూడా నమ్మరన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు ఉపేంద్రరాజు, లోకేష్ రెడ్డి, మండల పార్టీ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరెడ్డి, కాణిపాకం బోర్డు డైరెక్టర్ ప్రతిమ, శాఫ్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కిరణ్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు, సర్పంచ్ ధర్మయ్య, సుధాకర్‌రెడ్డి, గంగాధరం, వెంకటేశు, కిరణ్, కమల, శ్రీవిద్య, మునిబాబు, సుధీర్‌రెడ్డి, రాజారెడ్డి, ఇరగారెడ్డి, మంగిరెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేతకు మంత్రి నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: మండలంలోని తడుకుపేటకు చెందిన సీనియర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ నేత, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, ప్రస్తుత నగరి జెడ్పీటీసీ సభ్యులు గాంధీ తండ్రి ఎంపీ సుబ్రమణ్యం అలియాస్ పళని(70) కర్మక్రియలకు మంత్రి ఆర్కేరోజా హాజరయ్యారు. సుబ్రమణ్యం చిత్రపటానికి, సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి, పార్టీ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవం



విశేష అలంకరణలో అమ్మవారు

శ్రీరంగరాజపురం: మండలంలోని వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో గురువారం కుంభాభిషేక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన పందిరిలో గణపతి పూజ, పూర్ణాహుతి, హోమ పూజలు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ అమ్మవారి ప్రతిమను వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ఠ చేశారు. తదుపరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకిపై వేంచేపు చేసి వివిధ రకాల పుష్పాలు, పట్టు పీతాంబరాలతో పాటు వెండి తొడుగులతో కూడిన ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి ఊరేగింపును అంగరంగ వైభంగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఆవరణలో మహిళలు పొంగళ్లు పెట్టి ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలో రుత్వికులు పెద్ద ఎత్తున పూజలు చేయడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయం ఆవరణలో భాగవతారిణి హరికథా కాలక్షేపం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు కాశప్ప, గోవిందయ్య, శ్రీను, చిరంజీవులు రెడ్డి. గిరి, నిర్వాహకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆదరించండి



అరూరులో ఇంటింటా ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

నింద్ర: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, ఎంపీపీ దీప కోరారు. గురువారం అరూరు పంచాయతీలో 'మేము సిద్ధం–మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి కరపత్ర ప్రచారం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రోజాను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభా, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కో–ఆప్షన్ సభ్యులు అనిల్ మహేష్, సర్పంచ్ కేశవులు, నాయకులు వీరయ్య, దామోదరం, సింగిల్‌విండో అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



విజయపురం ఏఓకు రాజీనామా లేఖలు ఇస్తున్న వలంటీర్లు



కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డికి రాజీనామా లేఖను అందజేస్తున్న వలంటీర్ జయసుధ

విజయపురంలో..

విజయపురం : మండలంలోని పాతర్కాడు పంచాయతీకి చెందిన వలంటీర్లు కే.రాజేశ్వరి, పి.సురేష్, మోహన్‌బాబు రాజీనామా చేశారు. గురువారం వారు ఏఓ రమణప్రకాష్‌కు రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లపై టీడీపీ చేస్తున్న దుష్ప్రచారానికి నిరసనగా తాము రాజీనామా చేశామని వెల్లడించారు.

పుత్తూరులో..

పుత్తూరు: తెలుగుదేశం పార్టీ నాయకుల వేధింపులకు తట్టుకోలేక మరో వలంటీర్ స్వచ్ఛందంగా రాజీనామా చేసిన సంఘటన గురువారం పుత్తూరులో చోటు చేసుకుంది. మున్సిపాలిటీ 9వ వార్డు గోవిందపాళెం సచివాలయ పరిధిలో క్లస్టర్ 7వ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న జయసుధ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డికి రాజీనామా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయసుధ మీడియాతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నానని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకుల వేధింపులు అధికం కావడంతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

వేలం వాయిదా

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయానికి చెందిన షాపులను లీజుకు ఇవ్వడానికి నిర్వహించదలచిన బహిరంగ వేలాన్ని అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వీధి, టీబీ రోడ్డులలోని షాపుల వేలం తేదీని త్వరలోనే తెలియజేస్తామన్నారు

బాబుకు పింఛనర్ల శాపనార్థాలు

జగన్ వచ్చాక ఇదే తొలిసారి



నాకు ఇప్పటికే 78 ఏళ్లు, కళ్లు కూడా సరిగా కనిపించడం లేదు. కాళ్ల నొప్పులతో అల్లాడుతున్నా. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి గత నెల వరకు వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి ఇచ్చేవారు. ఈ సారి రాలేదు. జగన్ బాబు ఈ పింఛను ఇచ్చినా చంద్రబాబుకు మనసొప్పలేదు. సుమారు రెండు కిలో మీటర్ల దూరం వరకు నడిచి వచ్చాను. తినేందుకు తిండి లేకపోయినా నిరీక్షించి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. జగన్ సీఎం అయ్యాక ఇలా పింఛన్ కోసం రావడం ఇదే తొలిసారి. మా మనవడు జగన్ మళ్లీ అయ్యేవరకు మాకీ బాధ తప్పదేమో.

–గురవమ్మ, విడిదిపల్లి, పెనుమూరు మండలం

రాక్షసుడు ఈ చంద్రబాబు



సరిగ్గా సమయం చూసుకొని మా కడుపు కొట్టిన చంద్రబాబు నాశనమైపోతాడు. ఒకటో తేదీన ఇంటి వద్దకే వచ్చే పింఛనును అడ్డుకున్నాడు దుర్మార్గుడు. ఏ మాత్రం మానవత్వం లేని నరరూప రాక్షసుడు చంద్రబాబు.. మా ఉసురు తగులుతుంది. మా లాంటి ముసలి, ముతక, వికలాంగులు, జీవితాలతో నువ్వు ఆడుకుంటున్నావు.. రానున్న ఎన్నికల్లో నీకు ఆ దేవుడు బుద్ధి చెబుతాడు గుర్తుపెట్టుకో. ఇది నాగోడు మాత్రమే కాదు. నాలాంటోళ్లు ఎంత మంది ఉసురు పోసుకున్నావో.. అంతకంత అనుభవిస్తావు.

– చిలకమ్మ (89) పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం మండలం

ఇంటి వద్దనే పింఛన్ ఇచ్చే ప్రభుత్వం కావాలి



వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు ఇవ్వడం ఎంతో సౌకర్యంగా ఉండేది. నేను పశువులు మేపుకునేవాడిని. ఆ పనులు వదులుకుని ఇప్పుడు పింఛన్ కోసం నేను ఇంటి నుంచి సచివాలయానికి ఇబ్బందులు పడుతూ వెళ్లా. మధ్యాహ్నం వరకు అక్కడే ఉన్నా. నాకు పింఛను లేటుగా ఇచ్చినారు. మా పనులు వదులుకుని వెళ్లడం అంటే కష్టమే. మాకు ఇంటి కాడే పింఛను ఇచ్చే ప్రభుత్వం కావాలి.

– సుబ్రమణ్యం, నింద్ర



నింద్ర: సచివాలయం మెట్లు ఎక్కలేక మరొకరి సాయంతో వస్తున్న వృద్ధులు

ఇన్నేళ్లూ ఈ బాధల్లేవు



జగన్‌సామి చలవతో ఇన్నేళ్లూ పింఛను తీసుకునే బాధల్లేవు. తెల్లారకుండా వలంటీరు ఇంటికే వచ్చి ఫించను ఇచ్చేవాడు. నేను, మా ఆయన మాత్రమే ఇంట్లో ఉంటాం. మా ఆయన వికలాంగుడు. నాకు ఒక కన్ను కనిపించదు. నాకు 70 ఏళ్లు. ఈ వయసులో నేను పెన్షన్ కోసం సచివాలయానికి నడిచి వెళ్లి రావాలంటే కష్టమే. పొద్దున్నుంచే ఎండలు మండిపోతున్నాయి. మాకు పింఛను డబ్బులు వస్తేనే ఇల్లు గడుస్తుంది. మందులు కొనుక్కుంటాం. ఇక విధి లేక ఎండలో పింఛను కోసం వచ్చా. ఈ వయసు నాకెందుకు ఈ బాధ? ఇట్టా కష్టాలు పెట్టడంలో చంద్రబాబు ఏం ఆనందమో మరి! కష్టపెట్టడంలో చంద్రబాబుకు ఏమి అంత ఆనందం.

–ఎస్‌కే సాలమ్మ, కరకంతాపురం, నగరి మున్సిపాలిటీ

నిటారుగా నిలబడలేను



నాకు 83 ఏళ్లు. నిలబడలేను. నా భర్త చనిపోయారు. పిల్లలు వేరే కాపురం పెట్టేశారు. ఇంట్లో నేను మాత్రమే ఉన్నాను. జగన్‌బాబు దయవల్ల ఇంటికే పెన్షన్ వస్తుంటే కష్టం తెలియలేదు. ఒకటోతేది వచ్చే డబ్బులతోనే నెల రోజులు గడిపేదాన్ని. ఇప్పుడేమో వలంటీర్ ఒకటో తేది రాలేదు. పింఛను లేకపోతే నాకు గడవదు. పక్కింటివాళ్లను అడిగితే వలంటీర్లు పింఛను ఇవ్వకూడదని చంద్రబాబు ఆపేసాడంట. మేమే అక్కడకు పోయి తీసుకోవాలని చెబితే ఆ పింఛను కోసం తలపై తువ్వాలు వేసుకొని మెల్లగా నడిచిపోతున్నా. కష్టపెట్టినోడికి మా ఉసురు తప్పక తగులుతుంది.

– మునెమ్మ, ముడిపల్లె, నగరి మండలం

ఇదేం ఖర్మ బాబూ?



ఏ కష్టం లేకుండా చేతికి అందే పెన్షన్ ఈ నెల కష్టాల పాలు చేసింది. నా పిల్లలందరూ బయట ప్రాంతంలో ఉన్నారు. నాకు, నా భార్యకు పెన్షన్ డబ్బులే ఆధారం. ఒకటో తేది అలా వచ్చిందంటే ఉదయాన్నే వలంటీరు ఇంటివద్ద ఉండేవారు. అక్కడే పెన్షన్ ఇచ్చేసేది. ఆ డబ్బులతో రెండు నెలలకు ఒక సిలిండరు కొనుక్కుంటాం, రేషన్‌లో బియ్యం, చక్కెర, పప్పు తీసుకుంటాం. మిగిలిన డబ్బులతో కొంత పాలకు, కొంత కూరగాయలకు, మందులకు ఖర్చుచేసుకుంటాం. ఇప్పుడేమే వలంటీరు రాలే. పింఛను ఇవ్వలే. విచారిస్తే టీడీపోల్లు వలంటీరు పెన్షన్ తేకూడదని రిపోర్టు ఇచ్చినారంట. మేమే సచివాలయంకు పోవాలంట. నేను నడిచి వెళ్లి వచ్చేసరికి నీరసమొచ్చింది.

– గురవయ్య, ఓజి. కుప్పం, నగరి మండలం

14 వరకే కొత్త ఓటర్ల నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

నగరి: ఈ నెల 14 వరకే 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులకు ఓటు నమోదుకు అవకాశం ఉందని, ఆపై ఓటు కొత్త ఓటర్ల నమోదు చేయరని ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి స్పష్టం చేశారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన అన్ని పార్టీల నేతలు, అధికారుల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో అనుమతి పొందలకుండా ఏ పార్టీ అయినా సభలు, సమావేశాలు, ర్యాలీ మొదలైన కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. పార్టీలు చేసే వ్యయాల పరిశీలనకు అధికారులను నియమించామని, నామినేషన్లు ప్రారంభించిన నాటి నుంచి ఈ ప్రక్రియ మరింత కట్టుదిట్టంగా ఉంటుందన్నారు. ఓటర్ల తొలగింపు, సవరణలకు గడువు ముగిసిందని ఇక అభ్యర్థనలు చేసినా స్వీకరించేది లేదన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.2.07 లక్షలు, 4 బైకులు స్వాధీనం

యాదమరి(పూతలపట్టు): జూదం ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ రవిశంకర్‌రెడ్డి కథనం.. అందిన రహస్య సమాచారం మేరకు యాదమరి మండలం దళవాయిపల్లె పంచాయతీ పరిధిలోని మామిడితోట వద్ద పోలీసులు దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 9 మందిని ఎస్ఐ రామాంజనేయులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,07,370, నాలుగు మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- మాటపై నిలబడే నేత జగనన్న మాత్రమే
- ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టండి
- రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి

భార్య గెలుపు కోసం భర్త ప్రచారం



ప్రచార కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు

నగరి : మాటపై నిలబడే నేత జగనన్న మాత్రమే అని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధి సత్రవాడలో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. తమది ఉత్తుత్తి హామీలు ఇచ్చే బూటకపు ప్రభుత్వం కాదని, ఓటు కోసం గాలిమాటలు చెప్పే ప్రభుత్వం కాదన్నారు. చంద్రబాబు ఇచ్చే హామీలు నీటిపై రాతలేనని, వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని కరపత్రాలతో చాటిచెబుతున్నామని, చంద్రబాబు పాలనలో ఇలా ఏనాడైనా చేశారా? అనేది ఆలోచించాలని ఓటర్లను కోరారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఫ్యాను గుర్తుకే ఓట్లేసి మళ్లీ వైఎస్సార్ సీపీ పట్టం కట్టాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, జిల్లా నేతవిభాగం అధ్యక్షులు కన్నాయిరం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, మురుగ, నాయకులు అయ్యప్ప, జగన్, ఆనంద్‌కుమార్, మణి, మేషాక్, దినకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సోదరి గెలుపు కోసం..

పుత్తూరు: మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే జగనన్నకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండని వైఎస్సార్ సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీ 16వ వార్డులో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. తన సోదరి, మంత్రి ఆర్కే రోజా నగరి నియోజకవర్గంలోని చేసిన అభివృద్ధి, అందజేసిన సంక్షేమాన్ని కరపత్రాలతో వివరిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన జగనన్న రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రతి హామీనీ నెరవేర్చారని, ఇదే చంద్రబాబుకు, జగనన్నకు ఉన్న తేడా అన్నారు. దీనిని గుర్తెరిగి జగనన్నను నిండు మనస్సుతో ఆదరించాలని కోరారు. మీ ఆడపడుచు అయిన మంత్రి రోజమ్మను నగరి ఎమ్మెల్యేగా మూడవసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కె.వనిత, మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, పార్టీ నాయకులు కేసీ.కార్తికేయన్, ఏకాంబరం, మనోహర్‌రెడ్డి, మునిరత్నం, షకీలా, మురళీరెడ్డి, చక్రి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.